
పూరింటి మీదనించి గిరికీలు తిరుగుతూ కొడుతోంది చలిగాలి. గాలికి తాటాకులు చిన్నగా శబ్దం చేస్తున్నాయి. పంచలోగుంజకి ఆనుకుని కూచొని శూన్యంలోకి చూస్తున్న వరలక్ష్మి...




"అమ్మా...ఆకలే..." అంటూ చెంగు పట్టుకుని లాగిన నాలుగేళ్ళ కొడుకు వైపు తల తిప్పి చూసింది.

పేడతోఅలికి చాలా రోజులయిన మట్టి నేలమీద— ఓపిక లేనట్లుగా నీరసంగా కూచొని వున్నాడు పోతరాజు.

పోతరాజుకి నాలుగేళ్ళంటే ఎవరూ నమ్మరు. లివర్ వ్యాధి బాగా ముదిరినట్లుగా శరీరానికి మించి ఉబ్బిపోయిన పొట్ట. పీక్కుపోయిన ముఖంలో వెళ్ళుకొచ్చినట్లుండే దవడలూ, ఎప్పుడూ దేన్నో వెతుకుతున్నట్లుండే కాంతి నశించిన కళ్ళూ... చింపిరి జుట్టూ.

పౌష్టికాహారం లోపించి సరైన ఎదుగుదల లేకుండా—గిడసబారిన వెంపలి చెట్టులాగా పోతరాజు.

వరలక్ష్మికి ఏం సమాధానం చెప్పాలో తోచ లేదు. ఒకవేళ ఏదో ఒకలాగా నచ్చచెప్పినా వాడు ఊరుకోడనీ తెలుసు. అయినా పరిస్థితుల గురించి వాడికేం తెలుసు.

"నాకు మాత్రం—పదేళ్ళనాడు...అమ్మా, నాన్న బాధపడటం ఎలాగో నేర్చుకోవడాన్ని ఆ రోజుల్లోనే మొదలుపెట్టారని...నాకు మాత్రం అప్పుడేం తెలుసు" అనుకుంది వరలక్ష్మి.

"అమ్మా...అన్నమే..." పూచిక పుల్లల్లాంటి కాళ్ళని నేల మీద కొడుతూ ఏడుపు అందుకున్నాడు పోతరాజు.

ఈపూరుపాలెం మీద నిశ్చలంగా నిలబడివున్న ఆకాశం నీలంగా వుంది.

ఊళ్ళోని ప్రతి ఇంటిమీద బాగా ఎండిన తాటాకులు నల్ల డాగుల్తో, తెల్ల తెల్లగా అసహ్యంగా వున్నాయి.

ఊరంతా నిశ్శబ్దంగా వుంది. ఇళ్ళలోని మగ్గాలు—ఏడుపుని దిగమింగుకుని, కళ్ళు మూసుకున్నట్లున్న శవాల్లా అచేతనంగా పడివున్నాయి. ఊరు...మూకుమ్మడి చావుల్ని చూసిన శ్మశానంలా, విషాదం మూర్తీభవించినట్లుగా తెలీని భయాన్ని కలిగిస్తోంది.

చలిగాలి విసురుగా వీచింది. రోడ్డు మీది చెత్తా చెదారం గాలికి లేచొచ్చి—పంచలో పరుచుకుంది.

కొరుపట్టిన ముతక నేతచీరని భుజాల చుట్టూ కప్పుకుంది వరలక్ష్మి.

"ఆయన ఏడకెళ్ళాడో?" ప్రొద్దుటనగా బయటకెళ్ళిన భర్తనీ,అత్తయ్యనీ తల్చుకుంది. ఆర్నెల్ల బట్టీ పని అనేది ఎరక్కుండా మగ్గాన్ని మూత బెట్టి...సంసారం గడవడం కోసం అందినచో

టల్లా అప్పులు చేస్తూ—అందని చోటల్లా అదుక్కుంటూ...క్రమంగా ఊబిలో దిగబడుతున్న రత్తయ్య.

రత్తయ్య గుర్తుకి రాగానే వరలక్ష్మి కళ్ళలో నీళ్ళు చిమ్మాయి.

రొమ్ము మీద ఎముకల గూడు కనిపిస్తూ లోతుకి పోయిన పొట్ట, చలికి పగిలి, తెల్లటి పొట్టు రేగిన సన్నటి బలహీనమైన కాళ్ళూ, చేతులూ! పీక్కుపోయిన చెంపల్ని పూడ్చే మాసిన గడ్డం.

దిగుడు బావుల్లా నీటి చుక్క అనేది లేకుండా ఎండిపోయి, లోతుకు పోయి, ఏలోకంలోకో దిగులుగా, భయంగా ప్రాణాల్ని గుప్పెట్లో పెట్టుకున్నట్టు చూస్తుండే...ఆ గాజు కళ్ళు.

తను పదేళ్ళనాడు మనసునిండా నింపుకున్న రత్తయ్య రూపం ఆమె కళ్ళ ముందు కనిపించి... ఈనాటి కృశించిన రత్తయ్య రూపాన్ని వెక్కిరించినట్లయింది.

"ఎట్లాంటి వాడు...ఎట్లా అయిపోయాడు?" బాధతో ఆమె మనసంతా చెమ్మగా అయింది.

దుమ్ములో కూచొని ఏడుస్తున్న పోతరాజు ఏడుపు...తెరలు తెరలుగా తెములుస్తూ చుట్టుకుంటోంది.

వరలక్ష్మి లేచి నిలబడింది.

"ఆపరా సచ్చినోడా. సద్దాకా తిండి రందే" చెయ్యెత్తి కొడుకుని కసిరింది. అలా కసురుకుందన్న మాటేగానీ, గునపంలాంటిదేదో ఆమె గుండెలో కనిపించకుండా దిగబడినట్లుగా అనిపించి లోలోపలే విలవిలలాడింది.

ఏదో తోచి రోడ్డు మీదికి దిగి, రెండిళ్ళవతలి వెంకటేశ్వరమ్మ ఇంటి వైపు అడుగులు వేసింది.

పోతరాజు కూడా జారిపోతున్న నిక్కర్ని పైకి లాక్కుంటూ తల్లి వెనకాలే నడిచాడు. సమయానికి వెంకటేశ్వరమ్మ ఇంట్లోనే వుంది.

వెంకటేశ్వరమ్మ వాళ్ళ సొంత మగ్గం కూడా అందరి మగ్గాల్లాగే పనిలేకుండా బూజుపట్టింది.

కానీ, వెంకటేశ్వరమ్మ మొగుడు మాత్రం... రామ్మూర్తిగారి కరెంటు మగ్గాల్లో నూలుకి పాలిష్ పెట్టే పనిలో చేరడం చేత మిగతా నేత పని వాళ్ళకన్నా రెండు పూటలా సంగతి అటుంచి రోజుకి ఒక్కసారైనా పెళ్ళాం ముగ్గురు పిల్లల నోళ్ళలోకి నాలుగు వేళ్ళూ పోగలుగుతున్నాయి.

చింపిరి దానికి జడ వేస్తున్న వెంకటేశ్వరమ్మని—

"అక్కా కాసిన్ని నూకలు వుంటే ఇస్తావా? పిల్లాడు ఆకలికి ఆగలేక పోతున్నాడక్కా...ఆయన రాగానే ఇచ్చేస్తాలే..." అడగలేక...నోరు తెరిచి బలవంతాన అడిగింది వరలక్ష్మి. ఈమధ్య ఇలాంటి పరిస్థితులు మరీ తరచుగా రావడం ఆమెకే తెలుస్తోంది.

"నా దగ్గర నూక లేదవే? సన్లొంచి మొగోడు రావాల, నూకలు తేవాల. రాత్రి మిగిలింది పిల్లలకి తలా కాస్త పెట్టా. వాళ్ళు తప్ప ఎవరూ ముద్దెత్తలేదే వరం. ఆయనొచ్చాక...రూపాయికి హోటల్ సాంబారు తెచ్చుకునీ...తలా కాస్త...తినాల..." అంది వెంకటేశ్వరమ్మ.

"నాక్కాడా కాస్త...అదేలే...పిల్లాడికి ఓ ముద్ద..." అంటోంది వరలక్ష్మి...అంతకన్నా ఎలా అడగాలో తోచక.

సరైన తిండిలేక కృశించి, ఆదోరకంగా బక్కచిక్కిన వికారమైన రూపాలతో, వెంకటేశ్వరమ్మ పిల్లలు ముగ్గురూ...చచ్చిపోయిన కుక్కలాగా పడివున్న రాట్నం చుట్టూ పరిగెత్తుతున్నారు.

"ఏమే...వరం...నేను తీర్చాల్సింది నీ పిల్లాడి ఆకల్నా? నా పిల్లల ఆకల్నా?" అనుకుంది వెంకటేశ్వరమ్మ.

కాలిమీది పుండు మీద వాలుతున్న ఈగల్ని తోలుకుంటున్నాడు పోతరాజు.

మళ్ళీ ఏమనుకుందో ఏమో? వెంకటేశ్వరమ్మ లేచి ఇంట్లోకి వెళ్ళి ఒక కప్పులో కాస్త అన్నం కరడు తీసుకొచ్చి వరలక్ష్మి చేతిలో పెట్టింది.

"పో. ఆడికి తినిపించు..." అంది.

వరలక్ష్మి కొడుకుని తీసుకుని ఇంటికొచ్చిపడింది.

ఆ కాస్త అన్నాన్నే అటు కెలికి ఇటు కెలికి నాలుగు గ్లాసుల మంచినీళ్ళు తాగి నాలుగు ముద్దలు తిన్నాడు పోతరాజు. తర్వాత చాపమీద పడుకుని నిద్రకి ఒరిగాడు.

వరలక్ష్మికి ఆకలి చచ్చిపోయినట్లుగా అయింది.

ఎదురుగుండా బూజులు చుట్టుకుని వేళాడుతూ...చేనేత మగ్గం...మూగబోయి దీనంగా చూస్తోంది.

ఆమెకి చిన్నప్పటి ఎప్పటి సంగతులో గుర్తొచ్చాయి.

అమ్మ రాట్నం మీద నూలు వడుకుతోంది. నాన్న మగ్గం గోతిలో నడుం దాకా కూచొని ఆరు గజాల జరీ చీరె నేస్తున్నాడు.

తను అమ్మ ఒడికే నూలునీ, జరీ చీరెకి నాన్న తిప్పుతున్న కండెనీ కన్నార్పకుండా చూస్తోంది.

అప్పట్లో జరీ చీరెలకి పాలిష్ పెట్టి సాపు చేసే అమ్మ శరీరాన్ని, కొర్రులు పడిన ముతక చీరె ఎందుకు ఎప్పుడూ అంటిపెట్టుకుని వుంటుందో తనకి అర్థం అయ్యేది కాదు.



మాట ఇరవయ్యో నంబరు జరీ అంచు పంచల్ని అవలీలగా రోజుకి పదహారు గంటలు పనిచేస్తూ పచ్చాలకి పచ్చాలు నేసి పారేసే నాన్న— వొంటి మీద కనీసం చొక్కా కూడా లేకుండా కుట్లు పడిన పాత పంచెనే ఎందుకు కట్టుకుంటాడో అప్పట్లో తెలిసేది కాదు.

కానీ...ఒక్కటంటే ఒక్కటి మాత్రం ఆశపడేది తాను. మేనత్త కొడుకైన తనంటే ఇష్టపడే తానెంతో మోజుపడే రత్తయ్యని పెళ్ళిచేసుకోవాలి. "నేను రంగునూలు వడకాలి. రత్తయ్య ఆ నూలు మగ్గం మీద వేసీ కండె తిప్పీ జరీచీర ఆరు గజాల జరీ అంచు చీర నా కోసం నేయాలి. ఆ చీరని సంకురాత్రి పండగ రోజు కట్టుకుని నాగారపమ్మ సిదులకి పోవాల"అంతే. జీవితానికి అది చాలు.

అనుకునేది అప్పుడు.

"అమ్మా వరం తల్లీ. బాగా తెలిసిన కుర్రాడే... ఖండలాఫీసులో అటెండరు వుద్యోగం...మళ్ళీ ఈ మగ్గాలూ నేతలూ ఈ బాధలన్నీ నువ్వేడ పడతావే నా మాట వినమ్మా. వీరేశాన్ని చేసుకో... గవర్నమెంట్ పనమ్మా...సరేనా?" అంటూ నచ్చచెప్పిన తండ్రి.

తను రత్తయ్యని తప్పితే ఎవర్నీ చేసుకోనని మొండికేసింది అప్పుడు.

ఒక్కగానొక్క కూతురి మాటని నొప్పించలేక చెల్లెలి కొడుకైన రత్తయ్యకిచ్చి పెళ్ళిచేసి కూతుర్నీ, మగ్గాన్నీ దరిద్రాన్నీ అల్లుడి చేతిలో పెట్టి రెండేళ్ళకి కన్నుమూసిన అమ్మ, నాన్న.

పెళ్ళయిన నాలుగేళ్ళలో రెండు అబార్షన్‌లు వొంట్లోని సత్తువని పీల్చిపారేశాయి.


మగ్గాల మీద వెలిగే లైట్ల మూలంగా సరిగా ఆనని చూపు. విడవకుండా పట్టి పీడించే మాదు పోటు.

యవ్వన ప్రారంభంలో మొలకెత్తిన కలలూ, ఆశలూ ఎటు ఇగిరిపోయాయో?

సంవత్సరం క్రితం దాకా ఎనభై నంబర్ చేనేత చీరని నెలకి నాలుగు పచ్చాల చొప్పున నేయగలిగేవాడు రత్తయ్య. రోజుకి పదహారు గంటలుపైన పనిచేసి పచ్చానికి వంద చొప్పున నెలకి నాలు గొందల రూపాయిల ఆదాయం.

తను లడ్డీలు, కండెలూ వొలవడం చేసేది. నాలుగేళ్ళ క్రిందట పుట్టిన జబ్బు పిల్లాడైన పోతరాజు మందులకీ, అబార్షన్‌లు తన వొంట్లోంచి లాగిపారేసిన సత్తువని పూడ్చుకోవడానికై వాడే టానిక్కులకీ అన్నిటికీ ఆ నాలుగొందలూ ఏమూలకి.

తను జీవితంలో కోరుకున్న ఒకే ఒక్క కల... జరీ చీరె.



ఆ ఒక్క కోరిక తీర్చడం కోసం తను వొద్దని ఎంత వారించినా వినకుండా నూలు తెచ్చి ఆరేడు నెలల క్రితం రత్తయ్య మొదలుపెట్టిన చీరె.

అరపచ్చం నేతన్నా పూర్తికాకముందే ముంచుకొచ్చిన ముప్పు.

మగ్గం మీదే...అలాగే ఆగిపోయిన పావు భాగం నేసిన జరీ చీరె. పుట్టుకతోనే పురిటి వాతం కమ్మి చనిపోయిన అనాకార శిశువులాగా ఇంకా దుమ్ము, ధూళి పేరుకుపోతున్న మగ్గం మీదే... అలాగే వుంది. చావుకోసం ఎదురు చూస్తున్న చిక్కి శల్యమైన మంచం మీద ముసలమ్మలా.

వరలక్ష్మికి ఇల్లు చీకటి గుయ్యారంలా శూన్యంగా అనిపించింది.

ఆరు నెలల క్రిందట వూళ్ళో చాలా మంది కుటుంబాలకి కుటుంబాలే సూరత్తు వైపు మర మగ్గాల మీద పని చేయడానికి, ఇళ్ళు భద్రంగా తాళాలు వేసుకుని మరీ చెక్క పెట్టెలు తలల మీద బ్రతుకు భారాల్లా మోపుకుని వలస వెళ్ళిపోవడం చూశాక రత్తయ్య కూడా వెళదామనడం వరలక్ష్మికి గుర్తొచ్చింది.

ఆ రోజు తాను "వద్దు మనం అలా వెళ్ళిపోవద్దు. ఒకసారంటూ వెళ్ళామో మళ్ళీ ఎప్పటికీ తిరిగి రాలేం" అని గట్టిగా చెప్పింది.

పోనీ...వెళితే...ఏమో? బ్రతుకు ఎలా రాసిపెట్టివుందో?

ఆమెకి భవిష్యత్తంతా అంధకారంలాగా, కాంతికిరణ మనేది కనిపించని చీకటి గుయ్యారంలా... నల్లటి సముద్రంలా అనిపించింది.

జీవితాన్నే ఒక పీడ కలలాగా భ్రతికే... తాము...ఈ కమ్ముకున్న కారు చీకట్ల లోంచి బయటపడటం ఎలాగో ఆమెకి అర్థం కాలేదు.

మగ్గం మీద మధ్యలోనే ఆపేసిన జరీ అంచు చీర. తన పసి హృదయం నించి, వేళ్ళు నాటుకుని విస్తరించిపోయిన ఒకానొక కోరిక తాలూకు...పర్యవసానం. వరలక్ష్మి కళ్ళ ముందు వెక్కిరిస్తున్నట్టుగా కన్నీళ్ళు కారుస్తున్నట్టుగా వెల వెల బోతూ మగ్గం మీద కనిపిస్తోంది.

నిద్రలో పోతరాజు చిన్నగా కదిలాడు.

"ఆయన ఏడకెళ్ళాడో? ఎప్పటికొస్తాడో?" అనుకుంది వరలక్ష్మి.

చీకటి పడింది. కడుపులో ఏమీ లేకపోవడం చేత శోషవచ్చినట్టుగా, వరలక్ష్మి కూడా చాపమీద వొరిగి సొమ్మసిల్లిపోయింది.

ఆమెకి కలత నిద్రలో ఒక కల వచ్చింది.

ఆ కలలో ఊళ్ళో మగ్గాలన్నీ మహా ఉత్సాహంగా పనిచేస్తున్నాయి. ఆడవాళ్ళు లడ్డీలు, కండెలు వొలుస్తూ, నూలు సాపు చేస్తున్నారు. మగాళ్ళు రెట్టించిన ఉత్సాహంతో మగ్గాలు నేస్తున్నారు. ఊరంతా ఒకటే మగ్గాలు ఆడుతున్న శబ్దంతో మార్మోగిపోతోంది. అంతే.

వరలక్ష్మికి చప్పున మెలకువ వచ్చింది.

బయటంతా తెల్లగా తెల్లారిపోయి వుంది.

లేచి కూచుని కళ్ళు నులుముకుని ఎందుకో యధాలాపంగా మగ్గం వైపు చూసింది వరలక్ష్మి.

అంతే వరలక్ష్మికి నిలువు గుడ్లు పడ్డాయి.

వరలక్ష్మి కోసం నేస్తూ మధ్యలోనే ఆపేసిన మగ్గం మీదే వుంచేసిన జరీ చీరెని లావాటి తాడుగా పేనుకుని ఇప్పటి దాకా జీవితాన్ని బ్రతికించిన ఒకే ఒక్క జీవనాధారమైన ఆ మగ్గానికి ఉరి వేసుకుని నిర్జీవంగా వేలాడుతూ రత్తయ్య శరీరం.

వరలక్ష్మి గుండె పగిలేలాగా పెద్దగా అరచి మాట పడిపోయినట్టుగా మూర్ఛవచ్చి నేలమీద పడిపోయింది.

తల్లి అరుపుకి నిద్ర లేచిన పోతరాజు గుక్క పెట్టి కుళ్ళి కుళ్ళి ఏడవడం మొదలుపెట్టాడు.

బూజులు వేళ్ళాడుతున్న చేనేత మగ్గం మృత్యు శకటంలాగా భయానకంగా నిలబడి వుంది.

బయటకి పొడుచుకు వచ్చిన రత్తయ్య కళ్ళు తన చావుకి బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నట్టుగా వున్నాయి.

రత్తయ్యలాంటి వందలాది చేనేత కార్మికుల ఆకలి చావుల్ని దాచుకున్నట్టుగా పోతరాజు ఏడుపు బరువెక్కి ఇల్లంతా చుట్టబెట్టుకుంటోంది.

పూరింటి తలుపులోంచి చలిగాలి కొడుతోంది.

రత్తయ్య మెడచుట్టూ త్రాచుపాములా చుట్టుకుని వున్న సగం నేసిన చీరలోని జరీ...ఇంటి కప్పులోంచి పడుతున్న లేత ఎండలో తళుకుమని మెరిసింది. ◆